ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
5
ఆదివారం 28 జూలై 2024





గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

మిడ్ మానేరుకు గోదావరి జలాలు

- శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు షురూ..
- నంది పంప్ హౌస్‌కు 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు
- ప్రభుత్వ ఆదేశాలతో నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో మోటార్లు ఆన్ చేసిన అధికారులు

ఎదురు చూపులకు తెరపడింది. వర్షాలు లేక వెలవెలబోతున్న రిజర్వాయర్లను చూసి ఆందోళన చెందుతున్న రైతులకు ఉపశమనం లభించనుంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు నీటి మట్టం శనివారం 17.396 టీఎంసీలకు చేరుకుంది. దీంతో నీటిని నంది పంప్‌హౌస్‌కు తరలించారు. అక్కడ నాలుగు మోటార్లు ఆన్ చేసి 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. సాయంత్రం వరకు ఆ నీరు గాయత్రి పంప్‌హౌస్‌కు చేరడంతో అక్కడ నాలుగు మోటార్లు ఆన్‌చేసి మిడ్‌మానేరుకు తరలించారు. ఆ నీరు రాత్రి వరకు మిడ్‌మానేరుకు చేరాయి. ఈ యేడు సాగునీరు అందుతాయో లేదోనని ఆందోళన చెందిన రైతులు నీటి విడుదలతో ఊపిరి పీల్చుకున్నారు.

7లో..



వన మహోత్సవానికి సర్వం సిద్ధం

- నగరంలో 3.5 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- రూ.2.8 కోట్లతో ఎవెన్యూ ప్లాంటేషన్‌కు టెండర్లు
- త్వరలో ఇంటింటికి పండ్లు, పూల మొక్కల పంపిణీ

కరీంనగర్ టౌన్, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం నిర్వహణకు అధికారయంత్రాంగం సర్వంసిద్ధం చేసింది. గత ఏడాదిలో మాదిరిగానే లక్ష్యానికి మించి మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రమైన కరీంనగర్‌ను గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా మార్చేందుకు నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తున్నారు.గత ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో నగరంలో దాదాపు 15 లక్షలకుపైగా మొక్కలు నాటింది.ఈ యేడు రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం పేరిట విరి విగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది.

ప్రజల భాగస్వామ్యంతో లక్ష్యాన్ని అధిగమిస్తాం

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

నగరంలో ఇప్పటి వరకు ఎనిమిది విడతల్లో దాదాపు 15 లక్షల మొక్కలను నాటాము. వాటిలో దాదాపు 80శాతం అంటే 12 లక్షల మొక్కలను సంరక్షించాం. పాలకవర్గ సభ్యులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల సమష్టి సహకారంతో కరీంనగర్‌ను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చేందుకు కృషిచేస్తున్నాం. నగరపాలక సంస్థకు చెందిన నర్సరీల్లో పండ్లు, పూల మొక్కలు పెంచుతున్నాం. వర్షాలు ఇప్పుడిప్పుడే కురుస్తున్నందున త్వరలోనే వనమహోత్సవ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడతాం. ప్రతి ఇంటికి మూడు పండ్లు, మూడు పూల మొక్కలను పంపిణీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించాం. ఇప్పటి వరకు హరితహారం కార్యక్రమం ప్రజల సహకారంతో విజయవంతమైంది. ఈసారి కూడా ప్రజల భాగస్వామ్యంతో లక్ష్యాన్ని అధిగమించి గ్రీన్ అండ్ క్లీన్ సిటీ కోసం కృషిచేస్తాం.

నర్సరీల్లో అందుబాటులో మొక్కలు

ఇందులో భాగంగా నగరంలో మూడున్నర నుంచి నాలుగు లక్షల పండ్లు, పూలు, ఔషధ మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుని నగరపాలక సంస్థ నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. మరోవైపు కాలనీలు, శివారు ప్రాంతాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో లక్ష మొక్కలను పెంచి వాటిని సంరక్షించేందుకు 2.8 లక్షలతో ఇటీవల టెండర్లు నిర్వహించారు. ఎవెన్యూ పాంటేషన్, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, రాశివనంలో మొక్కలు నాటడంతోపాటు ప్రతి ఇంటికి మూడు పూలు, మూడు పండ్ల మొక్కలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో ఆగస్టు మొదటి వారం నుంచి నగరంలో వనమహోత్సవాన్ని ముమ్మరంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటుంది. మూడేళ్ళుగా వార్షిక బడ్జెట్‌లో 10 శాతం గ్రీన్ బడ్జెట్ కేటాయిస్తుండటంతో పట్టణాల్లో పచ్చదనంలో మార్పులువచ్చాయి. ఏటా నాలుగు లక్షలకు తగ్గకుండా మొక్కలు పెంచుతున్నారు. ఇదే స్ఫూర్తితో నగరపాలక సంస్థతోపాటు అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అడవుల తరహాలో బృహత్ వనాలు...

నగరంలో పట్టణ ప్రకృతి వనాలు, మియావాకీ బృహత్ వనాలు ఉండగా రహదారులకు ఇరువైపులా, డివైడర్ల మధ్య మొక్కలు భారీగా నాటించారు. ఇళ్లలో ప్రతి ఇంటికి పూల, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఏపుగా పెరగడంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. కరీంనగర్ ఫిల్టర్ బెడ్ వద్ద రాశివనాన్ని ఏర్పాటు చేశారు. బుల్ సెమన్ సెంటర్‌లో 47 వేల మొక్కలు, పీజీ ఫార్మసీ కళాశాలలో 25,290 ఉండగా అక్కడ అటవీ ప్రాంతాల తరహాలో కనిపిస్తున్నాయి. కరీంనగర్‌తోపాటు ఇతర మున్సిపాలిటీల్లో నాలుగేళ్లుగా నర్సరీలు ఏర్పాటు చేశారు. కావాల్సిన మొక్కలను స్వయంగా పెంచుతూ ఇందుకు ప్రత్యేకంగా కార్మికులను నియమించారు. రిజర్వాయర్లు, ఎల్‌ఎండీ కట్ట కింది భాగంలో, స్వశక్తి సంఘాలద్వారా నర్సరీలు ఉన్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 22 నర్సరీలు ఉండగా ప్రస్తుతం నాలుగు లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో పండ్లు, పూలు, ఔషధ మొక్కలతోపాటు షో ఫ్లవర్స్‌ను పెంచుతున్నారు.

సంరక్షిస్తేనే ఫలితం

వనమహోత్సవం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. మున్సిపాలిటీల్లోని వీధుల్లో మొక్కలు నాటుతుండగా రక్షణ చర్యలు తీసుకోవడానికి అధికారులు పట్టించుకోవడం లేదు. కొత్త చట్టం ప్రకారం నాటించిన వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉంది. నాటిన ప్రతి మొక్క ఎదిగేలా చూడాలి. విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడం, ఆ శాఖ తొలగిస్తుండడంతో ఫలితం లేకుండా పోతోంది.



బల్దియా నర్సరీలో పండ్లు, పూల మొక్కలు

మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి

- విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంతో మహిళలు వ్యాపారంలో రాణించి విదేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేసేలా ఎదగాలని కలెక్టర్ పమేలా సత్పతి మహిళా సంఘాల ప్రతినిధులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇందిరా మహిళా శక్తి, మెప్మా కార్యక్రమాలతోపాటు వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మార్కెట్‌ను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఉత్పత్తి చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసు కునే విధంగా ప్రణాళిక రూపొందించు కోవాలని అన్నారు. మహిళా శక్తి కార్యక్ర మంతో మహి ళలు వివిధ వ్యాపార రంగాలను ఎంచుకునే అవకాశముం దని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్ర మాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని చెప్పా రు. కష్టపడి నిజాయితీగా పనిచేస్తే ఆ రంగంలో మంచిగా రాణించ వచ్చన్నా రు. ఏదైనా సాధించాలనే తపన కృషి, పట్టుదల ఉంటే ఆ రంగంలో రాణించ వచ్చని చెప్పారు. మహిళలు ఈవెంట్ మేనేజర్‌గా వ్యవహరించే వ్యాపా రాన్ని ప్రారంభించి రెట్టింపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అనంతరం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రదర్శనలు, స్టాళ్లను కలెక్టర్ ఆసక్తిగా పరిశీలించి, నిర్వాహకులను అభినందించారు. సమా వేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, మెప్మా ఇన్‌చార్జి పీడీ స్వరూపరాణి, పరిశ్రమల కేంద్రం జీఎం నవీన్‌కుమార్, డిప్యూటీ లేబర్ కమిషనర్ శామ్యూల్, మున్సిపల్ కమిషనర్లు నాగరాజు, రమేశ్, సమ్మయ్య, అయాజ్, శ్రీనిధి అధికారి రవికుమార్, డీఎంసీ శ్రీవాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

డిమాండ్ ఉన్న ఉత్పత్తులను తయారు చేయండి

చొప్పదండి, జూలై 27: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని డిమాండ్ ఉన్న ఉత్పత్తులను తయారు చేయాలని కలెక్టర్ పమెలా సత్పతి అన్నారు. శనివారం చొప్పదం డిలోని నవ భారతి మండల సమైఖ్య కార్యాలయంలో మహిళా శక్తి కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వశక్తి మహి ళలను మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కోటీశ్వరులను చేయడానికి చర్యలు తీసుకుంటుం దన్నారు. మైక్రో ఎంటర్ ప్రైజెస్ కింద ఏదైనా వ్యాపారం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్డీవో శ్రీధర్, అదనపు డీఆర్డీవో సునీత, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ నరేందర్, డీపీఎంలు ప్రవీణ్, రమణా రవీందర్, ఏపీఎం నర్మద, మహిళలు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆదాయానికి, వ్యయానికి పొంతనలేని రాష్ట్ర బడ్జెట్

- ముఖం చెల్లకనే నీతి అయోగ్ సమావేశానికి డుమ్మా
- కేసీఆర్ బాటలోనే రేవంత్
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆదాయానికి, వ్యయానికి పొంతన లేకుండా రాష్ట్ర బడ్జెట్ ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రుణమాఫీకి 35 వేల కోట్లు అవసరమని చెప్పి బడ్జెట్‌లో 15 వేల కోట్లే కేటాయంచారన్నారు. రైతు భరోసాపై క్లారిటీ లేక ఏడాదిపాటు రైతులు నష్టపోయారన్నారు. రాష్ట్రంలో 14 మంది నేతన్నలు ఆకలితో మరణించినా పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లకు 12 వేల రూపాయలు, 12 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. మహిళలకు నిధులే కేటాయించకుండా కోటి మంది మహిళలను కోటీశ్వరులను ఏలా చేస్తారన్నారు. పామాయిల్ తోటలు, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్య శ్రీ నిధుల్లో కేంద్రం వాటా ఉందా లేదా అని ప్రశ్నించారు. విద్యకు ఏడు శాతం, ఆరోగ్యానికి నాలుగు శాతం కేటాయింపులు చేయడం సిగ్గు చేటన్నారు. 52 శాతం ఉన్న బీసీ జనాభా సంక్షేమానికి 3.5 శాతం నిధులే ఎలా కేటాయిస్తారన్నారు. దళిత సంక్షేమంలో భారీ కోత విధించి ఆ వర్గానికి అన్యాయం చేశారని విమర్శించారు. ఎక్సైజ్‌ద్వారా ఆరు వేల కోట్లు అదనపు ఆదాయం పెంచుతామని అన్నారని, మద్యాన్ని ఏరులై పారించాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. కేంద్ర నిధులకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వక వేల కోట్ల రూపాయల నిధులు మురిగిపోతున్నాయన్నారు. కేంద్రం నిధులిస్తున్న పథకాలకు ప్రధాన మంత్రి ఫొటో పెట్టాల్సిందేనన్నారు. మర్చంట్ బ్యాంకర్స్ ద్వారా అధిక వడ్డీలకు వేల కోట్లు అప్పు తెచ్చే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెర తీసిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చ జరగాల్సిందే అన్నారు. కేసీఆర్ బాటలోనే రేవంత్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు తప్పదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో లక్షా తొమ్మిది వేల కోట్లు కేంద్రాని వని ప్రకటించిన వారే కేంద్రం తెలంగాణకు అన్యాయం చేసిందని తీర్మానం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. నీతి అయోగ్ సమావేశానికి సీఎం డుమ్మా కొట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. భారత్‌ను నంబర్ వన్‌గా తీర్చిదిద్దడం, కేంద్ర రాష్ట్ర సంబంధాల బలోపేతం లక్ష్యంగా నిర్వహిస్తున్న నీతి అయోగ్ సమావేశానికి ముఖం చెల్లకనే వెళ్లలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాళేశ్వరంలో అక్రమాలు జరిగాయని కేంద్ర కమిటీ స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే బీజేపీకి వ్యతిరేకంగా తీర్మానం చేశాయన్నారు. అవసరమైతే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనమవుతుందన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు నిధులు అడిగిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లోనిధులు ఎందుకు కేటాయించలేదన్నారు. కేటీఆర్ కాళేశ్వరం ఆలయ సంప్రదాయాలు పాటించకుండా గర్భ గుడిలోకి వెళ్లడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేటీఆర్ నాస్తికుడని, హిందూ సనాతన ధర్మాన్ని అవమానించిన కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కేంద్రాన్ని బద్‌నాం చేసేందుకే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణాకు అన్యాయం చేశారంటు తీర్మానం చేశారని, రాష్ట్ర బడ్జెట్‌లో కేంద్రం నుంచి వచ్చే నిధులు లక్షా 9వేల కోట్లని చెబుతూ తెలంగాణకు కేంద్రం పైసా ఇవ్వలేదని తీర్మానం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారేంటీలు అమలు చేయలేక కేంద్రంపై దుష్ప్రచారం చేస్తూ తీర్మానం చేసి డ్రామాలడుతున్నారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ మహిళా, యువ, రైతు, సంక్షేమ బడ్జెట్ అన్నారు రాష్ట్ర బడ్జెట్‌లో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు నిధుల కేటాయింపుపై ఎందుకు ప్రస్తావించలేదన్నారు. వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్‌పార్క్ ఏర్పాటు చేసినప్పుడు సిరిసిల్లలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని పది ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్, కేటీఆర్ ఎందుకు ప్రతిపాదించలేదన్నారు. కేటీఆర్, ఇక్కడి రాష్ట్ర మంత్రి ఇద్దరు మిత్రులేనని, అందుకే దానిపై మాట్లాడడం లేదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, రాణి రుద్రమదేవి, వికాస్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

మహిళలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

భగత్‌నగర్, జూలై 27: కేంద్ర ప్రభుత్వం మహిళల్ని పూర్తిగా విస్మరిస్తున్నదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి అన్నారు. శనివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నిర్వహిస్తున్న రాజీకయ శిక్షణ తరగతుల సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళల్ని కేవలం ఓటర్లుగా వాడుకుంటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హక్కులు అమలు చేయడాన్ని విస్మరిస్తున్నాయన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై వివక్ష తీవ్రంగా ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో మహిళలని పూర్తి విస్మరించారన్నారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు కేఎస్ ఆశాలత, మాచర్ల భారతి, సహాయ కార్యదర్శులు పాలడుగు ప్రభావతి, ఎన్‌రత్నమాల, కె గీతారాణి, మద్దెల వినోద, నాగలక్ష్మి, బి అనురాధ, శశికళ, అహల్య, ఎ మహేశ్వరి, జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ద్యావ అన్నపూర్ణ దేవేంద్ర, రోజారాణి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్‌పుణ్యవతి

వడ్డీ వ్యాపారిపై కేసు

సిరిసిల్ల క్రైం, జూలై 27: సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన దుబాల మొండయ్య అనే వడ్డీ వ్యాపారిపై శనివారం కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇంటి పత్రాలు, ఖాళీ బాండ్ పేపర్లు తాకట్టు పెట్టుకొని మొండయ్య అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చినట్లు, కట్టనివారి ఆస్తులు అక్రమంగా స్వాధీన చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా బాధితులు ఉంటేస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి మావోయిస్టు అమరవీరుల

సంస్మరణ వారోత్సవాలు



మంథని, జూలై 27: భూమి కోసం.. భుక్తి కోసం.. పీడిత ప్రజల విముక్తి కోసం.. దశాబ్దాలుగా సాగుతున్న ప్రజా పోరులో నేలకొరిగిన మృత వీరులను స్మరించుకునేందుకు సీపీఐ మావోయిస్టు పార్టీ ఏటా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించుకుంటోంది. వారోత్సవాలు జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ ఇప్పటికే పత్రికా ప్రకటనతో పిలుపునిచ్చింది. నక్సల్బరి-శ్రీకాకుళం పోరాటాల వారసత్వాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పునికి పుచ్చుకుంది. ఈ చైతన్య ఉద్యమ వారసత్వ కారణంగా మంథని, పెద్దపల్లి, రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీల అరాచకాలు, అణచివేతలపై ప్రజలంతా విప్లవోద్యమ చైతన్యంతో ప్రజలు దొరలు, దొరల గడీలపై దండయాత్రలు చేయడంతో పాటు జగిత్యాల జైత్రయాత్రతో పోరాటాల ఖిల్లా చరిత్రకెక్కింది. సీపీఐ మావోయిస్టు పార్టీకి సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి దశాబ్దాల కాలంగా ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత జగిత్యాల) బీర్‌పూర్ గణపతి స్వగ్రామం. గణపతి దళపతిగా పని చేసిన ఖిల్లా అయిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు మూడున్నర దశాబ్దాలకుగా పైగా సాగుతున్న విప్లవోద్యమంలో వందల సంఖ్యలో వీరులు అమరలయ్యారు. నిరంతరం పోలీసుల దాడులు.. వరుస ఎన్‌కౌంటర్.. పెరిగిన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్.. తగ్గిన రిక్రూట్‌మెంట్ల కారణంగా కొన్ని సంవత్సరాలుగా మావోయిస్టులు తమ కార్యకలాపాలను అటవీ ప్రాంతాలకే పరిమితం చేశారు.

మిడ్ మానేరుకు గోదావరి జలాలు

● శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు షురూ.. ● నంది పంప్ హౌస్‌కు 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు
● ప్రభుత్వ ఆదేశాలతో మోటార్లు ఆన్ చేసిన అధికారులు ● ప్రవాహాన్ని బట్టి రోజుకు 2 టీఎంసీల తరలింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వరద నీరు పెద్ద ఎత్తున వస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మిడ్ మానేరుకు ఎత్తిపోయడం ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం నంది మేడారంలో గల నంది పంప్‌హౌస్ ఒక మోటారును ఆన్ చేసి సాయంత్రం వరకు క్రమంగా నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఈసారి కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయకుండానే శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోస్తుండడం గమనార్హం. పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శనివారం ఉదయం 14 వేల క్యూసెక్కులు, ఆ తర్వాత 13 వేలు, ఆ తర్వాత 16 వేలు, సాయంత్రం వరకు 12 వేల క్యూసెక్కులకు పెరుగుతూ, తగ్గుతూ వచ్చింది. మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రాజెక్టు నీటి మట్టం 17.396 టీఎంసీలకు చేరుకోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ నుంచి ధర్మారం మండలంలో గల నంది పంప్ హౌస్‌కు గ్రావిటీ ద్వారా నీటిని వదిలిపెట్టారు. అక్కడి నుంచి మొదట ఒక మోటారును ఆన్ చేసి క్రమంగా సాయంత్రం 5 గంటల వరకు నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని నంది మేడారం రిజర్వాయర్‌లో ఎత్తిపోశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా అండర్ టన్నెల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడ నుంచి మోటార్ల ద్వారా వరద కాలువలో నీటి ఎత్తిపోయడంతో మిడ్ మానేరుకు వెళుతున్నాయి. నంది మేడారం పంప్‌హౌస్‌లో మొత్తం 7 మోటార్లు ఉన్నాయి. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు. మొత్తం మోటార్లు నడిస్తే 22,050 క్యూసెక్కుల నీళ్లు అంటే 2 టీఎంసీల నీటిని తరలించవచ్చు. రోజుకు రెండు టీఎంసీలను తరలించే విధంగా అండర్ టన్నెళ్లు, పంప్‌హౌస్‌లను నిర్మించారు. సాయంత్రం 6 గంటల వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సాయంత్రం వరకు 12,931 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగి పోవడం, అన్నారం బ్యారేజీకి బుంగ పడడం, సుందిళ్ల బ్యారేజీకి స్వీపేజీ సమస్య ఉండడంతో వీటిని సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం మరమ్మతులు చేయాలని సూచించింది. వాటికి మరమ్మతులు జరుగుతుండగానే వర్షాలు మొదలయ్యాయి. దీంతో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు మూడు బ్యారేజీల గేట్లు తెరిచి ఉంచాలని ప్రభుత్వానికి సూచించింది. దీంతో అక్కడి నుంచి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోయడం లేదు. ఎల్లంపల్లి ఎగువ భాగాన కురుస్తున్న వర్షాలు, కడెం ప్రాజెక్టు నిండి తద్వారా వస్తున్న అదనపు జలాలతో వారం రోజుల్లో 13 టీఎంసీల నీళ్లు ప్రాజెక్టులోకి వచ్చాయి. ఈ నెల 18వ తేదీ వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టం 5.140 టీఎంసీలు కాగా, ఆ మరుసటి రోజు నుంచి కురుస్తున్న వర్షాలతో వరద పెరిగింది.

శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మిడ్ మానేరు) పూర్తి స్థాయి నీటి మట్టం 27 టీఎంసీలు కాగా, అందులో 6 టీఎంసీలు, లోయర్ మానేరు డ్యామ్ నీటి మట్టం 24 టీఎంసీలు కాగా, అందులో 6 టీఎంసీల నీళ్ల మాత్రమే ఉన్నాయి. క్యాచ్‌మెంట్ ఏరియాలో పెద్దగా వరద లేక పోగా, ఎస్సారెస్పీకి కూడా వరద లేదు. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లికి వరద పెరిగిన తర్వాత మిడ్ మానేరుకు నీటిని తరలించాలని నాలుగు రోజుల క్రితమే ప్రభుత్వం ప్రాజెక్టు అధికారులకు సూచించింది. జూన్ మాసంలో పెద్దగా వర్షాలు పడక పోగా, జూలై ఆరంభంలో కూడా గడ్డు పరిస్థితులు ఉండడంతో, గత ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను ఆన్ చేసి 8 నుంచి 9 టీఎంసీల నీటిని ఎల్లంపల్లిలోకి ఎత్తి పోశారు. ఇంతలో వరుసగా భారీ వర్షాలు పడడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలి పెట్టారు.

మిడ్ మానేరు, ఎల్ఎండీల పరిస్థితి దయనీయంగా ఉండడంతో గేట్లనుఎత్తకుండా ఎత్తిపోతలను ప్రారంభించారు. ఎల్లంపల్లికి పైనుంచి వస్తున్న వరద నీటిని వచ్చినట్లే తరలించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాలను అంచనా వేస్తూ ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. పైనుంచి వరద పెరిగితే మాత్రం రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించాలని అధికారులు నిర్ణయించారు.


నీటితో కళకళలాడుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు


నంది మేడారం పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న నీరు

గాయత్రి పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల

● నాలుగు పంపుల ద్వారా మిడ్‌మానేరుకు 12,600 క్యూసెక్కుల నీరు


గాయత్రీ పంప్‌హౌస్ వద్ద కాంగ్రెస్ నాయకుల సంబరాలు

రామడుగు, జూలై 27: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శనివారం సాయంత్రం అధికారులు నీటిని విడుదల చేశారు. మొదట ఒక బాహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు రాత్రి వరకు నాలుగు పంపుల ద్వారా నీటి విడుదలను కొనసాగించారు. పంప్‌హౌస్ నుంచి నేరుగా బాహుబలి పంపుల ద్వారా గ్రావిటీ కాల్వకు విడుదలైన నీరు నేరుగా వరద కాలువ ద్వారా పరవల్లు తొక్కుతూ ముందుకు సాగింది. ఇక్కడ 7 బాహుబలి పంపులు ఉండగా ఒక్కో పంపు ద్వారా రోజుకు 3150 క్యూసెక్కుల నీరు తరలి తరలించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే ఇక్కడ నాలుగు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తుండగా 12,600 క్యూసెక్కుల నీరు తరలివెళ్తున్నది. వరద కాలువ ద్వారా నీరు రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి వెళ్తుంది. వరద కాలువకు నీటిని విడుదల చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల పోటాపోటీ పూజలు

బీఆర్ఎస్ డిమాండ్ చేయడంతోనే నీటిని విడుదల చేశారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గాయత్రీ పంప్‌హౌస్ వద్ద నీటిలో పసుపు కుంకుమ పూలు చల్లి పూజలు నిర్వహించారు. మరోవైపు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి ఫలితంగానే నీటి విడుదల చేశారని హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు గాయత్రీ పంప్ హౌస్ వద్దకు పెద్ద ఎత్తున తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మిడ్ మానేరుకు చేరుకున్న ఎల్లంపల్లి జలాలు

బోయినపల్లి, జూలై 27: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి జలాలు చేరుకున్నాయి. ఎల్లంపల్లి నుంచి నంది మేడారం గాయత్రి పంప్ హౌస్ ద్వారా నీటి ఎత్తిపోతలు శనివారం ప్రారంభం కావడంతో ప్రాజెక్టులోకి రాత్రి 9 గంటల వరకు 2500 క్యూసెక్కుల ప్రవాహం ఎల్లంపల్లి నుంచి వరద కాలువ ద్వారా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 305.62 మీటర్లు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 5.90 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ధర్మపురి గోదావరి వద్ద పెరిగిన వరద

● కడెం నుంచి 6,670 క్యూసెక్కుల నీరు విడుదల


ధర్మపురి వద్ద గోదావరి నది ప్రవాహం

ధర్మపురి, జూలై 27: ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం శనివారం వేగంగా కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండుతున్నాయి. దీనికి తోడు కడెం నుంచి 6,670 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో ఆలయ స్నానఘట్టాల ముందు వరకు నీరు చేరింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది మైకుల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. నదీతీర ప్రాంతాలను ప్రజలను అప్రమత్తం చేశారు. రైతులు, కూలీలు జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్, సిబ్బంది చర్యలు చేపట్టారు. రాయపట్నం వంతెన వద్ద ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీలోకి 35,078 క్యూసెక్కుల నీరు


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. శనివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 35,078 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 31.035 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 66.508 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 605 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 24.766 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.354 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక మెడికో ఆత్మహత్య


కోమళ్ల శిరీష(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 27: పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక కరీంనగర్ శివారులోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోమళ్ల శిరీష(20) అనే విద్యార్థిని శనివారం ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదులోని వివరాల ప్రకారం..మరో మూడు రోజుల్లో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం పరీక్షలు ఉండటంతో ఒత్తిడిని భరించలేక శిరీష ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. చదువు తన నుంచి కావటం లేదని తరచుగా బాధపడిన ఒక్కగానొక్క కూతురు శిరీషను తల్లిదండ్రులు ఓదార్చుతూ భవిష్యత్ బాగుంటుందని సర్దిచెప్పేవారు. శనివారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి కరీంనగర్ నుంచి బస్సులో ప్రతిమ వైద్య కళాశాలకు వెళ్లింది. అనంతరం శిరీష తరగతులు ముగిసిన తరువాత 3 గంటలకు స్నేహితులతో కలిసి కరీంనగర్‌లోని విద్యానగర్‌లో ఇంటికి చేరింది. శిరీష తల్లిదండ్రులు కూడా అదే కళాశాలలో ఉద్యోగం చేస్తున్నారు. సాయంత్రం విధులు ముగించుకుని అందరం కలిసి ఇంటికి వెళదామని తల్లిదండ్రులు శిరీషకు చెప్పినప్పటికీ వినకుండా ఇంటికి చేరుకుంది. వెంటనే తల్లి ఇంటికి చేరుకునే సరికి శిరీష ఉరికి వేళాడుతూ కనిపించింది. దీంతో వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించిందని వెల్లడించారు. పరీక్షల ఒత్తిడి తట్టుకోలేకనే తన కూతరు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎల్ఎండీలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, జూలై27: గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. ఎల్ఎండీ పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రం వరకు 5.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. మోయతుమ్మెద వాగు నుంచి 576 క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. గత సంవత్సరం ఇదే సమయంలో ఎల్ఎండిలో 20 టీఎంసీలకు పైన ఉండగా పైనుంచి మోయతుమ్మెద, ఎంఎంఆర్ నుంచి కలిపి సుమారు 19వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లోలు ఎల్ఎండిలోకి వస్తుండటంతో ఎల్ఎండి పూర్తి స్థాయిలో నిండుతుండగా అధికారులు 16గేట్లు ఎత్తి 56వేల క్యూసెక్కులకు పైగా దిగువకు గోదావరిలోని నీటిని విడుదల చేశారు. కానీ ప్రస్తుతం ఎల్ఎండీ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎగువన కుంటలు, వాగులు,చెరువులు మత్తడి దూకకపోవడంతో పాటు, పైనుంచి మోయతుమ్మెద వాగులోనికి వరద నీరు కూడా రాకపోవడంతో ఎల్ఎండీలోని నీటి ఇన్‌ఫ్లోలు చాలా స్వల్పంగా ఉన్నాయి.


ఎల్ఎండీ రిజర్వాయర్

తల్లీ చదువుకుంటావా..

● వ్యవసాయ పనులు చేస్తున్న బాలికతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ● హాస్టల్‌లో చేర్పించి చదివిస్తానని హామీ


బాలికతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు విన్నవిస్తున్న కుటుంబం

గంగాధర, జూలై 27: గంగాధర మండలం చర్లపల్లి(ఆర్)లో ఎంఎన్ఆర్ఈజీఎస్‌లో 15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం తిరిగి వెళ్తుండగా గ్రామ శివారులో వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఓ బాలికను చూసి కేంద్ర సహాయ మంత్రి సంజయ్ ఎందుకు చదువుకోవడం లేదని ప్రశ్నించారు. కుటుంబ పరిస్థితిపై ఆరా తీశారు. దీంతో తన పేరు బోళ్ల అక్షయ అని టెన్త్ పాసైనప్పటికీ ఆర్థిక పరిస్థితులు బాగోలేక కూలీ పనులకు వెల్లుతున్నానని బదులిచ్చింది. చదువుకోవాలని ఉందని తెలపడంతో వెంటనే అక్కడే ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డిని పిలిచి బాలిక వివరాలు తీసుకుని వెంటనే కాలేజీలో చదివించడంతో పాటు ఆసక్తి ఉంటే హాస్టల్‌లో చేర్పించాలని చెప్పారు. దీంతో బాలిక తండ్రి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, రాష్ట్ర నాయకుడు మేకల ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌కి వెళ్లిన తన భర్త ఆచూకీ తెలుపాలని వినతి

కరీంనగర్ క్రైం : జీవనోపాధి కోసం దుబాయ్‌కి వెళ్లిన తన భర్త ఆచూకీ తెలియక ఇబ్బందులు పడుతున్నామని, ఆచూకీ కనుక్కోవాలని శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను బాధితులు కలిశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గురుకులకొండాపూర్ గ్రామానికి చెందిన చొక్కల శ్రీధర్ 2022 జూలై 27న దుబాయికి వెళ్లి అక్కడ షార్జాలోని సరత్ కంపెనీలో పనిచేసేవాడు. కంపెనీలో తక్కువ జీతం, యాజమాన్యం పెట్టే ఇబ్బందులను తట్టుకోలేక 2023 సెప్టెంబరు 7న కంపెనీ నుంచి బయటకు వెళ్లాడు. శ్రీధర్ కుటుంబ సభ్యులు అప్పుచేసి 2023 అక్టోబరు22న విమానం టికెట్ పంపించారు. కానీ శ్రీధర్ రాలేదు. అప్పటి నుంచి శ్రీధర్ ఆచూకీ లభించలేదు. శ్రీధర్‌కు రెండేళ్ల వయస్సు, ఏడాదిన్నర వయస్సున్న ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీధర్ భార్య చొక్కల అఖిల తన ఇద్దరు కూతుళ్లతో, కుటుంబ సభ్యులు శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి షార్జాలోని ఎంబసీ అధికారులకు మెయిల్ చేశారు. రెండు రోజులు సెలవులు ఉన్నందున సోమవారం వరకు వివరాలు వస్తాయని కేంద్ర మంత్రి చెప్పినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మెట్‌పల్లి రూరల్, జూలై, 27: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌ను శనివారం కలెక్టర్ సత్యప్రసాద్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం పాఠశాలలోని విద్యార్థి రాజారపు గణాధిత్య మృతి చెందడంతో పాటు మరో ఇద్దరు విద్యార్థులు రాపర్తి హర్షవర్ధన్, అడేపు గణేష్ అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థుల పట్ల బాధ్యత రహితంగా వ్యవహరించారని, జరిగిన ఘటనపై విచారణ చేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యల్లో భాగంగా కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి

ధర్మపురి, జూలై 27: ధర్మపురి మండలంలోని నేరెళ్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గోవింద్‌పల్లెకు చెందిన కోల శంకర్ (40) అనే రైతు శనివారం సాయంత్రం మృతి చెందాడు. శంకర్ వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మమత, ఇద్దరు కొడుకుల ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెండు ఆలయాల్లో చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో దొంగలు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ప్రధాన ద్వారం తాళాలు పగల కొట్టిన దొంగలు అమ్మవారి బంగారు పుస్తెలు, ముక్కు పుడక ఎత్తుకెళ్లారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 27: కేశవపట్నం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నవేణి లచ్చమ్మ (89) అనే వృద్ధురాలు అనారోగ్య సమస్యలు భరించలేక ఈ నెల 26న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 26న సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కుమారుడు చెన్నవేణి కొంరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

మానకొండూర్, జూలై 27 : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లికి చెందిన అదృశ్యమైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సదాశివపల్లికి చెందిన గాలిపల్లి శంకర్(40) అనే వ్యక్తి పేయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 25న కూరగాయల కోసం కరీంనగర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా 26న తీగల వంతెన సమీపంలోని చెక్‌డ్యాం వద్ద శంకర్ దుస్తులు కనిపించడంతో అతని భార్యా లీల స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి గాలిస్తుండగా శనివారం చెక్‌డ్యాంలో మృత దేహం లభ్యమైనట్లు సీఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి విక్రయదారుడి రిమాండ్

మానకొండూర్, జూలై 27 : గంజాయిని విక్రయించేందుకు వెల్లుతుండగా వాహనాల వాహనాల తనిఖీలో పట్టుబడ్డ యువకుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన సంగ వినయ్ అనే యువకుడు 240 గ్రాముల గంజాయిని విక్రయించేందుకు ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు బయలుదేరాడు. సదాశివపల్లి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న 240 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని తండ్రీకొడుకులకు గాయాలు

ఓదెల, జూలై 27 : మండలంలోని పొత్కపల్లి పెద్ద చెరువు మూల మలుపు వద్ద శనివారం కారు ఢీకొని పొత్కపల్లికి చెందిన దానవేని కుమార్, అతని కుమారుడు అర్జున్ సాయిలకు గాయాలయ్యాయి. పొత్కపల్లి నుంచి కుమార్ తన కుమారుడితో ద్విచక్ర వాహనంపై సుల్తాన్‌బాద్ వైపు వెళుతుండగా, మంచిర్యాలలో క్రషర్ నిర్వహించే వ్యక్తులు జమ్మికుంట వైపు వస్తున్న క్రమంలో పొత్కపల్లి పెద్ద చెరువు మూలమలుపు వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రికొడుకులిద్దరు పొలంలో ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, పోత్కపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన ఆస గీత(35) కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అల్మాస్‌పూర్‌కు చెందిన గీతకు వివాహమైన ఐదేళ్లకు విడాకులయ్యాయి. ఏడాది క్రితం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన రాజుతో వివాహమైంది. అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈ నెల 26న రాజు తన భార్య గీతను అల్మాస్‌పూర్‌లోని అత్తిగారింటికి తీసుకొచ్చి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఓ వైపు సంతానం కలగకపోవడం, మరో వైపు తీవ్రమైన కడుపునొప్పి భరించలేక గీత మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల వలయంలో పెద్దాపూర్ గురుకులం

● రెండు రోజుల క్రితం ఫిట్స్‌తో విద్యార్థి మృతి ● విషపురుగు కుట్టి మరో ఇద్దరికి అస్వస్థత ● ఇంటి దారి పట్టిన విద్యార్థులు


గురుకులం నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, జూలై, 21: మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపు బాలుర గురుకుల పాఠశాల సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలలో సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు విద్యార్థులకు అందని ద్రాక్షగానే మారాయి. గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి నిధులు కేటాయింపుల్లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వెంటాడుతుండడంతో విద్యార్థులు పాత గదుల్లోనే దినదిన గండంగా చదువులు సాగించాల్సి పరిస్థితి నెలకొంది. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 546 మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ వసతులతో కూడిన శాశ్వత భవనాలు కరువయ్యాయి. ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్ కళాశాలను కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 1970లో నిర్మించిన రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు. కనీసం పాఠశాలలో కిటికీలు లేని గదుల్లోనే విద్యార్థులు చదువు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలం, చలికాలం వచ్చిందంటే విద్యార్థులకు మరిన్ని కష్టాలు ఎదురవుతూనే ఉంటాయి. సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును విద్యార్థులు అప్పట్లో విన్నవించగా 2016లో రూ. 4.25కోట్లు నిధులు మంజూరు చేయించగా 2018లో పనులు ప్రారంభించారు. భవనం మంజూరు అయినప్పటికీ సొసైటీ సంస్థ నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వల్ల భవన నిర్మాణ పనులు నత్తనడకగా చేపట్టారు. కనీసం పాఠశాల గదుల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించక పోవడంతో పాములు విష పురుగులతో విద్యార్థులు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలో శుక్రవారం వేకువజామున విద్యార్థి రాజారపు గణాధిత్య ఫిట్స్‌తో మృతి చెందగా.. మరో ఇద్దరు విద్యార్థులు విష పురుగు కుట్టి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించి వారిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిక్షించి చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. ఒకే రోజు విద్యార్థి మృతి చెందడం, మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైనా కూడా కనీసం చికిత్స అందించడానికి స్టాఫ్ నర్సు లేక పోవడం గమనార్హం. విద్యార్థులు భయంతో ఇంటి దారి పడుతున్నారు. రాత్రివేళ ఏమైనా ఇబ్బందులకు గురైతే పట్టించుకోవడానికి వైద్య సిబ్బంది లేరని అందుకే ఇంటికి తీసుకెళ్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు.

'బిర్లా ఓపెన్‌మైండ్స్'లో ఫ్యామిలీ డే



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ రూరల్, జూలై27: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్‌లో శనివారం ఫ్యామిలీ డే నిర్వహించారు. కిండర్ గార్డెన్ పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఫ్యామిలిడే ఎంతో ఉత్సాహంగా సాగింది, కుటుంబ సమేతంగా పిల్లలతో కలిసి వచ్చిన తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిర్లా కుటుంబాన్ని ఒకే వేదికపై చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు.

అచీవర్స్ పాఠశాలలో రెయినీ డే

కరీంనగర్‌టౌన్, జూలై 27: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠ్యాంశంలో భాగంగా శనివారం రెయినీ డేను నిర్వాహిం నిర్వహించారు. విద్యార్థులు వర్షాకాలంలో ధరించే దుస్తులను మరియు వస్తువులను ధరించి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి.హెచ్.పల్లవి పాల్గొన్నారు.

జేఎల్‌ఎంల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జూలై27: విద్యుత్ శాఖలో జేఎల్‌ఎంలకు సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలు శనివారం పూర్తి అయినట్లు ఎస్‌ఈ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్షల అనంతరం రిజల్ట్‌ను వరంగల్‌కు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ పరిశీలకులు టీ.మధుసూదన్, హెచ్ఆర్డి ఛైర్మన్ గంగాధర్ పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం నిరసనలకు సిద్ధం'

గణేశ్‌నగర్, జూలై 27: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం నిరసనలకు సిద్ధం అవుతున్నట్లు కళాశాలల యాజమాన్య సంఘాల జిల్లా జాయింట్ కన్వీనర్ జీకృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలలు నడపడానికి చాల ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని శాంతి దీక్ష, ప్రజావాణిలో వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ఈసమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి యాదా రామకృష్ణ, అధ్యక్షులు వేంకటేశ్వర రావు,కార్యదర్శి శ్రీపాద నరేష్, శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి సీఎండీ అభినందనలు

గణేశ్‌నగర్, జూలై27: వర్షాలు విస్తారంగా కురుస్తుండటం వలన వినియోగ దారులకు ఎక్కడ అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందిస్తున్నందుకు అధికారులను, సిబ్బందిని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అభినందించారని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో గడచిన 4 నెలల్లో 128 వంగిన విద్యుత్ స్థంబాలు, 78తుప్పు పట్టిన స్థంబాలు, 196 వదులుగా ఉన్న 9800 మీటర్ల లైన్లు, 208 స్టే వైర్లు మార్చామన్నారు. ఈకార్యక్రమంలో కొంతమంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యుత్ శాఖకు సహకారం అందిస్తున్నారని తెలిపారు.

'శ్రీకృష్ణ యతీంద్రుల స్మృతి వనానికి కృషి'

కరీంనగర్ కల్చరల్, జూలై 27: ఇటీవల పరమపదించిన జిల్లాకు చెందిన త్రిదండి శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్‌స్వామి (కలువకుంట కృష్ణమాచార్యులు) స్మృతి వనానికి తన వంతు కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం సప్తగిరికాలనిలో ఓ ఫంక్షన్‌హాల్‌లో జీయర్ స్వామి శిష్యులు, పూర్వాశ్రమ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ ఉత్సవంలో ఆయన పాల్గొని స్వామీజీకి శ్రద్ధాంజలి ఘటించారు. స్వామీ జీతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుకు చేసుకొని, పూర్వాశ్రమ కుటుంబ సభ్యులకు, బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కెఎస్ అనంతాచార్య సమన్వయం మధ్య సాగిన ఈ కార్యక్రమంలో శిష్యులు, పూర్వాశ్రమ కుమారులు డాక్టర్ కె శ్రీమన్నారాయణ, కె జగన్నాథాచార్యులు, కె సింహాద్రి, డాక్టర్ కె రామకృష్ణ, బీజేపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, డీఆర్‌ఓ పవన్‌కుమార్, కలెక్టర్ సీసీలు రాంమోహన్‌రావు, నరసింగారావు, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ నలిమెల బాస్కర్, బెల్లి యాదయ్య, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, డాక్టర్ కె వరప్రసాదాచార్యులు, శ్రీవైష్ణవ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్య, కె అనంతరెడ్డి, గంప వేంకట్, రవీందర్, గోవర్ధనగిరి జగన్నాథాచార్యులు, డి రాజారాంమోహన్ పాల్గొన్నారు.

మగ్గాల కార్మికుల వంటావార్పు

గంగాధర, జూలై 27: గర్షకుర్తి మరమగ్గాల కార్మికులు శనివారం వంటవార్పు చేసి తమ నిరసన తెలిపారు. మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని చేపట్టిన దీక్షలు శనివారంతో మూడవ రోజుకు చేరింది. ఈసందర్భంగా కార్మికులు వంటవార్పు చేసి వినూత్నంగా తమ నిరసనను తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా ఉపాధిలేక ఇబ్బందుల పడుతున్నామని, ప్రభుత్వం ఉపాధి కల్పించాలని కోరారు. మూత పడిన మగ్గాలకు ప్రభుత్వం పని కల్పించేందుకు వస్త్రాల ఆర్డర్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గర్షకుర్తి మరమగ్గాల కార్మికులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చొప్పదండి, జూలై 27: భారీ వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు.శనివారం తన కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధిక వర్షాలతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో మేనేజర్ ప్రశాంత్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేటలో వనమహోత్సవం

రామడుగు, జూలై 27: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వన మహోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉపాధ్యాయులు మొక్కలను నాటారు. చెట్లను నాటడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే గుండి హైస్కూల్‌లో కూడా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ హెచ్‌ఎం శైలజ, విద్యాధికారి అంబటి వేణు కుమార్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, జలపతిరెడ్డి, సమ్మయ్య, హనుమాన్, మంజుశ్రీ, దయాకర్ తదితరులు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

గన్నేరువరం, జూలై 27: మండల కేంద్రంలో నారాయణ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య ఆసుపత్రి సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రదీప్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, సునీల్, శ్రీనివాస్, వెంకటేశ్వర్, డాక్టర్లు లక్ష్మి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సమస్యలు తీర్చాలని వినతి

రామడుగు, జూలై 27 : పాడి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకునేలా ప్రధాని మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు పాడి రైతులు చిలువేరు శ్రీనివాస్, రంగు శ్రీనివాస్‌లు శనివారం వినతిపత్రం సమర్పించారు. ప్రైవేట్ డెయిరీ వాళ్లతో మాట్లాడి సమస్య తీర్చి పునరావృతం కాకుండా చూడాలన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకుడు



మంత్రి పొన్నంతో రామారావు

ఇల్లందకుంట, జూలై 27: జమ్మికుంట మండల మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని ఇంగిలే రామారావు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 2002నుంచి పార్టీకి అంకిత భావంతో పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం తనవంతుగా మండలంలో శక్తివంచన లేకుండా పనిచేశానన్నారు. పార్టీ మార కుండా అంకిత భావంతో పనిచేసిన, రైతు కుటుంబానికి చెందిన నాకు జమ్మి కుంట మార్కెట్ ఛైర్మన్ పదవి అవకాశం కల్పించాలని కోరారు.

విద్యాసంస్థల్లో బోనాల వేడుకలు

కరీంనగర్ కల్చరల్, జూలై 27: నగరంలోని పలు విద్యాసంస్థల్లో శనివారం బోనాల వేడుకలను నిర్వహించారు. హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో వేడుకల్లో ప్రిన్సిపాల్ జంగ సునీతామనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. మంకమ్మతోట సిద్ధార్థ విద్యాసంస్థలో జరిగిన వేడుకల్లో ఛైర్మన్ శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు. పద్మనగర్, రాంనగర్‌లోని మానేరు పాఠశాలల్లో వేడుకల్లో ఛైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి పాల్గొన్నారు. పద్మనగర్ పారమిత హెరిటేజ్ స్కూల్లో డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, వినోద్ రావు, అనూకర్‌రావు, టిఎస్‌వి రమణ, వియుఎం ప్రసాద్, హెచ్‌ఎం హనుమంతరావు పాల్గొనగా ఛైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు శుభాకాంక్షలు తెలిపారు.

●**భగత్‌నగర్:** నగరంలోని సీతారాంపూర్ ఐవిఐ ప్రీ ప్రైమరీ పాఠశాలలో శనివారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐవిఐ పాఠశాల ఛైర్మన్ పసుల మహేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారన్నారు.

●**కరీంనగర్ టౌన్:** నగరంలోని భగత్‌నగర్ రావూస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నేషనల్ పేరంట్స్ డేను నిర్వహించి పెద్దమ్మతల్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారు, పోతరాజుల అలంకరణలో విద్యార్థులు అలరించారు. డప్పు చప్పుళ్లతో వేషాధారణల మధ్య బోనం ఎత్తుకొని ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈవో నితిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్ పాల్గొన్నారు.

●**గంగాధర:** గంగాధర ప్రభుత్వ పాఠశాల, వివేకానంద విద్యాలయాల్లో బోనాల పండగను నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

●**రామడుగు:** మండలంలోని గోపాల్‌రావులపేట లోని శ్రీ ప్రగతి హైస్కూల్ కిడ్స్‌లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ పూజ బోనమెత్తి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్, భూమయ్య హెడ్ మాస్టర్ మునిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**చొప్పదండి:** పట్టణంలోని కృష్ణవేణి, గీర్వాణి పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్లు పద్మాకర్‌రెడ్డి, గంగయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బోనాల వేడుకల్లో ఐవిఐ ప్రీ ప్రైమరీ విద్యార్థులు



వేడుకలో పాల్గొన్న సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు

మొక్కజొన్న పంటల పరిశీలన

కరీంనగర్ రూరల్, జూలై27: కరీంనగర్ మండలంలో వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు పలు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలను పరిశీ లించారు. శనివారం మండలంలోని చెర్లబూత్కూర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మొక్క జొన్న పంటలను పరిశీలించారు. వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ప్రధాన శాస్త్రవేత్త డా.జి, మంజులత, శాస్త్ర వేత్త డా.ఎం రాజేంద్ర ప్రసాద్, డా. మదన్, మోహన్‌రెడ్డి, శ్రీసత్యం, యంఎఓ బి.సత్యం, వ్యవసాయాధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఎన్నికలు

గణేశ్‌నగర్, జూలై 27 : విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా ఛైర్మన్‌లుగా వడ్లకొండ గంగాధర్ ఎస్‌ఈ, కరీంనగర్, బొంకూరి సుదర్శనం ఎస్‌ఈ పెద్దపల్లి, ఎ.సత్యనారాయణ ఎస్‌ఈ జగిత్యాలను ఎన్నుకొన్నారు. విజేందర్‌రెడ్డి, డీఈ టెక్నికల్, కన్వీనర్‌గా వి.రాజేంద్ర ప్రసాద్ ఎఓ, కోశాధికారిగా నియమించారు. అనంతరం మహబూబ్ నగర్లో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ ట్రోఫీని పైడిపల్లి రామ్ మోహన్ రావు కెప్టేన్ ఆధ్వర్యంలో, ఛైర్మన్ ట్రోఫీ 2వప్లేస్ (రాష్ట్ర స్థాయిలో) లను అధికారులకు అందజేశారు.

చట్టాలపై అవగాహన సదస్సు

కరీంనగర్ టౌన్, జూలై 27: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం ఏర్పాటు చేసిన ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేశ్, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ సంపత్ పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తతో హెపటైటిస్ నుంచి రక్షణ

సుభాష్‌నగర్, జూలై 27: ముందు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల హెపటైటిస్ నుంచి రక్షణ పొందవచ్చని మెడికవర్ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ప్రణీత్ అన్నారు. వరల్డ్ హెపటైటిస్ డేను పురస్కరించుకొని శనివారం మెడికవర్ ఆసుపత్రిలో ఉచిత హెపటైటీస్ ఏ, బి వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ అన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తాహా, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, ల్యాబ్ ఇంచార్జీ రాజు పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ తీసుకోవాలి



భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి

కరీంనగర్ టౌన్, జూలై 27: ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమంలోని వృద్ధులకు రుచికరమైన భోజనాన్ని అందించి, వారి ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కె.వెంకటేశ్ ఉద్యోగులను ఆదేశించారు. శనివారం నగరంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నాణ్యమైన సరకులను తెప్పించి వారికి భోజనం పెట్టాలని, ఎలుకలు, దోమలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. న్యాయ పరమైన లేదా న్యాయ సేవ అవసరమైనచో తనను సంప్రదించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తనుకు మహేశ్, వృద్ధాశ్రమం నిర్వాహకురాలు రాధిక పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్ ఏర్పాటు

గణేశ్‌నగర్, జూలై 27: వినియోగదారులకు మరింత చేరువై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ ఆఫీసులలో కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ను అమలు చేస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గంగాధర్ తెలిపారు. వినియోగదారులు తమకు సంబంధించిన అన్ని రకాల విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు నేరుగా ఏదైనా ఒక సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ ఆఫీసులలో ఫిర్యాదు చేసి రసీదు పొందగలరన్నారు. ఇట్టి ఫిర్యాదులను వాటి సమయాన్నిసారంగా పరిష్కరించడానికి తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కరించడానికి అధికారులను నియమించి వాటిని పరిష్కరించి ఫిర్యాదారునికి ఎప్పటికప్పుడు ఫిర్యాదు స్థితిగతులను ట్రాక్ చేసుకొనే వీలుంటుందని తెలిపారు. పరిష్కరించబడిన ఫిర్యాదుపై ఒకవేళ ఫిర్యాదు దారుడు సంతృప్తి చెందని ఎడల మరల ఫిర్యాదును తిరిగి నమోదు చేసే అవకాశాన్ని కూడా కల్పించామని తెలిపారు. ఇలా వినియోగదారుని ఫిర్యాదు పరిష్కారం అయ్యేంత వరకు ఫిర్యాదు ముగియదని పేర్కొన్నారు.

కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్ ద్వారా నమోదు చేయబడిన ఫిర్యాదుల స్థాయిని బట్టి డీఈ, ఎస్‌ఈ, కార్పొరేట్ కార్యాలయం ద్వారా పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. వినియోగదారులకు పూర్తి స్థాయిలో సేవలం దించే విధంగా కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తీర్చిదిద్దారని తెలిపారు.

విద్యుత్ సర్కిల్ డిపార్ట్‌మెంటల్ స్టోర్ తనిఖీ

గణేశ్‌నగర్, జూలై 27: నార్దర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ కరీంనగర్ సర్కిల్‌లోని డిపార్ట్మెంటల్ స్టోర్‌ను శనివారం హెచ్ఆర్డీ చీఫ్ ఇంజనీర్ టి.మధుసూదన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడి పనులు, కొత్త సర్వీసుల మంజూరుకు కావాల్సినంత మెటీరియల్ సమృద్ధిగా ఉందని తెలిపారు. కొత్త వ్యవసాయ కనెక్షన్లు, గృహ కనెక్షన్లు, గృహేతర సర్వీసులకు సంబంధించి మీటర్లు తదితర సామగ్రి మెటీరియల్ సిద్ధంగా ఉందని వివరించారు. నడుస్తున్న వర్షాకాలం, రాబోయే వరదల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా ఎక్కడ లోటు లేకుండా కావాల్సినంత మెటీరియల్ ను అందుబాటులో ఉంచుకున్నామన్నారు. 24గంటల నాణ్యమైన విద్యుత్ అందించడానికి విద్యుత్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్, డిఈటి విజయేందర్ డి రాజం, డిఈ తిరుపతి, స్టోర్స్ రఘు ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న ప్రభుత్వం



ఇల్లందకుంటలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్

ఇల్లందకుంట, జూలై 27: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అధ్యక్షతన బీజేపీ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలం చెందిందని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను అత్యధికంగా కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, అంతం ఎల్లారెడ్డి, కంకణాల సురేందర్‌రెడ్డి, ఎండీ షఫీఖాన్, లావణ్య, రాజేందర్, రమేష్, పవన్‌రెడ్డి, రాంబాబు, రమణాచారి, శ్రీనివాస్, రాజన్న, శివ, సంపత్, గోపాల్, మధుకర్‌రెడ్డి, దుర్గయ్య, వినయ్, రవీందర్, తిరుపతి, సాయిరెడ్డి, సంజీవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, మొగిలి, సతీష్, వెంకటేష్, అశోక్ పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీజేపీ మండల పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం వాసుదేవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన నాయకులను బీజేపీ శ్రేణులు నిలదీయాలన్నారు. అర్హత ఉండి రుణ మాఫీకి దూరమైన రైతులను గుర్తించి వారికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. రాబోయో స్థానిక సంస్థల ఎన్నికల్లో అర్హతలను బట్టి పోటీ చేసి గెలవాలని, కేంద్రం నుంచి గ్రామ పంచాయితీలకు వస్తున్న నిధులపై ప్రజలకు తెలపాలన్నారు. అనంతరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

వీణవంక,జూలై27:కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరచారి అన్నారు. మండల కేంద్రాంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల విస్తృతస్థాయి సమావేశం బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి అదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కాక హామీలను అమలు చేయడం లేదని అన్నారు. బీసీ డిక్లరేషన్,ఆరు గ్యారంటీలు రుణమాఫీ, దళిత బంధు రెండవ విడత నిధులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేని యెడల మండల శాఖ అధ్వర్యంలో ఆందోళనలు చేపడతమని అన్నారు. ఈ కార్యక్రమములో నాయకులు పుప్పాల రఘు,ముదిగంటి విద్యాసాగర్ రెడ్డి,చెన్న మాధవుని నర్సింహరాజు,మాడ గౌతమ్ రెడ్డి,నరేష్,రాజు,పెద్ది మాల్లాం రెడ్డి,సురేందర్ రెడ్డి,ఎనగంటి శ్రీనివాస్,గాజుల సమ్మయ్య, కొలిపాక తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన తెలంగాణ బడ్జెట్

హుజూరాబాద్, జూలై 27: తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోస్కుల అజయ్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించడం దేవుడెరుగని, కనీస విద్యను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే విద్యార్థుల, నిరుద్యోగుల ఆశలు, ఆశయాలపైన కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్ల చల్లిందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు రూ. 7వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సకాంలో ఫీజులు రాక ఉన్నత విద్యకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించి, మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు వరి సాగుపై అవగాహన

చొప్పదండి, జూలై 27: మండలంలోని రెవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వరి సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరి పొలాన్ని సందర్శించారు. వరినాటు, కలుపు, ఎరువుల వాడకంపై రైతు అమరేందర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందం,ఉపాధ్యాయుడు ముక్కల కుమార్,రాజిరెడ్డి ,సుమలత, రోజారాణి, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ చేపట్టాలి



బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

శంకరపట్నం, జూలై 27: మండలంలోని కేశవపట్నం నుంచి చెర్లపల్లె, ఎక్లాస్‌పూర్ , రేకొండ వరకు బీటీరోడ్డు, కేశవపట్నం, కరీంపేట, మొగిలిపాలెం వరకు రోడ్ల విస్తరణకు సహకరించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో శంకరపట్నం మండల బీజేపీ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ సానుకూలంగా స్పందించి మొదటిప్రాధాన్యతగా సీఆర్ఎఫ్ నిధుల నుంచి రోడ్డు విస్తరణ పనులు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మాణం గురించి చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, దండు కొంరయ్య, మహ్మద్ ఖాజాపాషా, శ్రీనివాస్, రాజు, సారయ్య, శ్రీనివాస్, సాయిప్రకాష్, సంపత్, రాజేష్, అరవింద్ పాల్గొన్నారు.

తప్పిపోయిన మతిస్థిమితం లేని వ్యక్తి

కరీంనగర్ క్రైం, జూలై 27: మతిస్థిమితంగా లేని వ్యక్తి కాల్వ లక్ష్మయ్య(58) ఈ నెల 25న ఇంటిలో నుంచి బయటకు వెళ్లి తప్పిపోయాడని, అతని ఆచూకీ కనిపెట్టి అప్పగించాలని కొడుకు కాల్వ కిషన్ శనివారం ఒకటో టౌణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శంకపట్నం మండలం కాచాపూర్‌కు చెందిన కాల్వ కిషన్ అల్కాపూర్ కాలనీలో నివాసం ఉంటుండగా తన తండ్రి లక్ష్మయ్య కూడా ఉంటున్నాడు. కొంత కాలంగా లక్ష్మయ్య మానసికస్థితి బాగాలేకపోవటంతో వైద్యం చేయిస్తున్నారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్ళిన లక్ష్మయ్య ఇంటికి చేరలేదని కిషన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సాధన స్కూల్‌లో కార్గిల్ దివస్

కరీంనగర్ టౌన్, జూలై 27: నగరంలోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కార్గిల్ దివస్‌ను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైనికుల వీరత్వానికి గౌరవ సూచకంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల ఛైర్మన్ సిహెచ్.శ్రీనివాస్‌రావు కార్గిల్ దివస్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, హెచ్‌ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్-2 డిపోలో వన మహోత్సవం

భగత్‌నగర్, జూలై 27: ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో వన మహోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్‌లు కెసత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్ వి మల్లయ్య సూపర్‌వైజర్లు తిరుపతి, విజయలక్ష్మి, వీరయ్య నరహరి, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుడు మృతి

కరీంనగర్ రూరల్, జూలై27: కరీంనగర్ మండల పరిధిలోని చామనపల్లి, ఎలబోతారం, జూబ్లీనగర్, ఫకీర్ పేట కార్మికుల, పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తుమ్మ రాజముల్ల శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. రాజమల్లు మృతదేహానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూజా సామగ్రి, దుకాణాల నిర్వహణకు టెండర్లు

కరీంనగర్ కల్చరల్, జూలై 27: స్థానిక మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో మంగళవారం మధ్యాహ్నం 11 గంటలకు ఆలయ పరిధిలోని 5 దుకాణాల నిర్వహణకు, 11-30 గంటలకు కొబ్బరి కాయలు, వాహన, పూజా సామాగ్రి అమ్మకాలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగారపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

అంబాలాపూర్ చెరువుకు గండి



వృథాగా పోతున్న నీరు

శంకరపట్నం, జూలై 27: శంకరపట్నం మండలంలోని అంబాలాపూర్ చెరువుకు గండి పడి నీరు వృథాగా పోతుంది. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో మత్తడి పక్కకు చెరువు కట్టకు కొత ఏర్పడి గండి పడింది. దీంతో చెరువులో ఉన్న నీరు వృథాగా పోతోంది. అధికారులు తక్షణమే చెరువు కట్టకు ఏర్పడ్డ గండిని పూడ్చి మరమ్మతు చేయాలని రైతులు కోరారు.

హుండీ ఆదాయం రూ. 2,92,067

చిగురుమామిడి, జూలై 27: చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 2,92,067 వచ్చినట్లు ఆలయ ఈవో కొండపర్తి రాజకుమార్ తెలిపారు. గత 10నెలల స్వామివారి ఆలయ హుండీని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా నాణెలు, నోట్ల ద్వారా రూ. 2,92,067 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. అట్టి ఆదాయాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు ఈవో రాజకుమార్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు శేషం నర్సింహాచార్యులు, పాము సత్యనారాయణ, సింగిల్ విండో ఛైర్మన్ జంగ వెంకటరమణరెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ గందె సంపత్‌కుమార్, గొల్లబత్తిని మహేష్, బొల్లం కనకయ్య, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బూట్ల కవిత, మంగ, పద్మావతి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశం

చొప్పదండి, జూలై 27: మండలంలోని కొలిమికుంట, చొప్పదండి అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు.పిల్లలకు అందిస్తున్న ఆహారం,విద్య గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు దేవమణి, లావణ్య పాల్గొన్నారు.

నియామకం

రామడుగు, జూలై 27 : మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన కొత్తూరి లవ్‌కుమార్‌ను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌మాదిగ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

తన నియమకానికి సహకరిం చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు, జిల్లా, మండల స్థాయి నాయకులకు లవ్‌కు మార్ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి కేంద్ర మంత్రి పరామర్శ

రామడుగు, జూలై 27: మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పు శ్రీనివాస్ తండ్రి మృతి చెందగా కుటుంబాన్ని శనివారం కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు.

'కాళేశ్వరం'పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

కరీంనగర్ టౌన్, జూలై 27: తెలంగాణకు వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్న మాటలు పూర్తిగా అబద్దాలేనని, కళ్ళుండి చూడలేని కబోధుల్లా మారారని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో విమర్శించారు.

స్థానిక ఎన్నికల్లో ఎస్టీలకు న్యాయం చేయాలి

సుభాష్‌నగర్, జూలై 27: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్టీలకు మూడు సీట్లు కెటాయించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ కోరారు. ఈమేరకు శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

బడ్జెట్‌లో విద్యారంగంపై చిన్న చూపు

కరీంనగర్ టౌన్, జూలై 27: బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగాన్ని చిన్నచూపు చూసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు.

కన్నకృష్ణకు సన్మానం

కరీంనగర్ టౌన్, జూలై 27: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కన్న కృష్ణను పలువురు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన నివాసానికి మాజీ మేయర్, సివిల్ సప్లయిస్‌కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, మాజీ కౌన్సిలర్ సాధవేణి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్, తదితరులు వెళ్ళి కన్నకృష్ణకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.